## క్లుప్తంగా...

### నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

**బోడుప్పల్:** 11కేవీ మారుతీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భవానినగర్, యాదవబస్తీ, సుభాష్‌నగర్, బీఎల్‌నగర్, ఎస్‌బీఆర్ కాలనీ, శ్రీసాయి ఎన్‌క్లేవ్, టెలిఫోన్ కాలనీ, సిద్ధి వినాయక్ నగర్, మారుతీనగర్, యాదాద్రినగర్, శుభోదయ కాలనీ, పెంటారెడ్డి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్, లక్ష్మీనగర్, కేశవనగర్ కాలనీల్లో కరెంటు ఉండదన్నారు.

**మేడిపల్లి ఫీడర్ పరిధిలో..**

**మేడిపల్లి:** మేడిపల్లిలోని ప్రధాన రహదారి శ్రీసాయి హాస్పిటల్ మెయిన్ నుంచి అపెక్స్ హాస్పిటల్ రోడ్డులో మరమ్మతుల కారణంగా 11కేవీ మేడిపల్లి ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, వినాయక్‌నగర్, ఓంవిహార్ కాలనీ, భరత్‌పురికాలనీ, మారుతినగర్ తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

### ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**ఉప్పల్:** చిలుకానగర్ డివిజన్ కార్యాలయాన్ని శుక్రవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ సందర్శించారు. వచ్చిన ఫిర్యాదులను, పరిష్కరించిన ఫిర్యాదులను తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసిన వారికి ఫోన్ చేసి మరి సమస్య పరిష్కారం అయ్యిందా? అంటూ అడిగారు. గతనెల 30వ తేదీ వరకు 37 ఫిర్యాదులు అందాయని, అందులో దాదాపుగా 33 వరకు పరిష్కరించినట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

### కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్‌రెడ్డి



**బోడుప్పల్:** బోడుప్పల్ నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా శుక్రవారం జి.వేణుగోపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బండ్లగూడ జాగీర్ కమిషనర్‌గా ఉన్న వేణుగోపాల్‌రెడ్డిని ఉన్నతాధికారులు బోడుప్పల్‌కు బదిలీ చేశారు. కమిషనర్‌ను మేయర్ సామల బుచ్చిరెడ్డి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, పాలకవర్గంతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

### బాలాజీహిల్స్ కాలనీకి బస్సు సౌకర్యం

**బోడుప్పల్:** బాలాజీహిల్స్ కాలనీ ప్రజలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు 9వ డివిజన్ కార్పొరేటర్ మోదుగు లావణ్య శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాలాజీ హిల్స్ బస్టాప్ వద్ద 113ఎఫ్‌ను బస్సును ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బస్సు వేయడంతో స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం తేలికైనట్లు వెల్లడించారు. ఈస్ట్ బాలాజీ హిల్స్ కాలనీ అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి, కాలనీవాసులు సుదర్శన్, రఘునాయక్, ఆర్టీసీ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### అక్రమ షెడ్డు కూల్చివేత



**కుషాయిగూడ:** చర్లపల్లి డివిజన్ నాగార్జుననగర్ కాలనీ మెయిన్ రోడ్డులో అక్రమంగా నిర్మించిన భారీ షెడ్డును శుక్రవారం కాప్రా టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నింబంధనలను అతిక్రమించి నిర్మాణం చేపట్టిన నిర్మాణదారులకు అధికారులు నోటీసులు జారీ చేసినా సమాధానం ఇవ్వకపోవడంతో షెడ్డును కూల్చివేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు. షెడ్డు నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేని విషయం వాస్తవమే అయినా అధికారులు తూతూమంత్రంగా కూల్చివేయడంలో అంతర్యమేమిటో అధికారులకే తెలియాలి.

### వరంగల్ జాతీయ రహదారిపై సీపీఐ ధర్నా

**మేడిపల్లి:** విభజన హామీలు అమలు చేయాలని హన్మకొండలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శాంతియుతంగా ధర్నా చేస్తుంటే పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.బాలమల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి డీజీ సాయిలుగౌడ్ అన్నారు. సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి రచ్చకిషన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. సాంబశివరావు అరెస్టును నిరసిస్తూ ఉప్పల్ బస్ డిపో వరంగల్ జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు.

# ప్యాకేజిస్టులకు ఉజ్వల భవిష్యత్

రామంతాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందిస్తున్న 'ప్యాకేజింగ్ టెక్నాలజీ కోర్సు రాష్ట్రంలోని మరే ఇతర కళాశాలలో లేదు. దేశ వ్యాప్తంగా ఈ కోర్సు కేవలం హైదరాబాద్‌లోని రామంతాపూర్, మహారాష్ట్రలోని నాగపూర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మాత్రమే అందుబాటులో ఉంది. దక్షిణ భారత దేశంలో ఈ కోర్సు ఉన్న నగరం హైదరాబాద్ మాత్రమే.. ప్యాకేజింగ్ టెక్నాలజీ చదివిన వారిని ప్యాకేజిస్టులు అంటారని, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ సంస్థల్లో మంచి జీతంతో ఉద్యోగంతో పాటు స్వయం ఉపాధి పెంచుకోవచ్చని రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ఆ కోర్సు విభాగాధిపతి డాక్టర్ వెంకట్‌రెడ్డి సాక్షికి వివరించారు. మిగతా విషయాలు ఆయన మాటల్లోనే.. – రామంతాపూర్



ప్యాకేజీ టెక్నాలజీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

**ప్రశ్న:** రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్యాకేజింగ్ టెక్నాలజీ కోర్సు ఏ సంవత్సరంలో ప్రారంభమైంది..?

**జవాబు:** ఈ కోర్సు 1996లో రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదలైంది. ప్రతి సంవత్సరం పాలీసెట్ ద్వారా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు. గతంలో కేవలం 30 సీట్లుగా ఉండే కోర్సు ఆదరణ పెరగడంతో ప్రభుత్వం 60 సీట్ల వరకు పెంచింది.

**ప్రశ్న:** ఈ కోర్సు పూర్తి చేసిన వారికి కెరీర్ ఎలా ఉంటుంది?

**జవాబు:** టెక్నాలజీ డిప్లామా కోర్సు పూర్తి చేసిన వారిని ప్యాకేజిస్టులంటారు. ప్రతి వస్తువును ఆకర్షణీయంగా సురక్షితంగా ఉండేలా ప్యాకింగ్ చేస్తుండటమే వీరి బాధ్యత. పెద్ద పెద్ద పరిశ్రమల్లో క్వాలిటీ కంట్రోలర్ ప్రొడక్షన్ డెవలప్‌మెంట్ ప్రొడక్షన్ ఇంజినీర్లుగా కెరీర్ ప్రారంభించవచ్చు.

**ప్రశ్న:** ప్రస్తుతం దేశంలో ఎన్ని ప్యాకేజింగ్ పరిశ్రమలు ఉన్నాయి?

**జవాబు:** 40 వేల వరకు భారీ మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. వీటి అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ సంస్థలు తక్కువగా ఉండటంతో ఈ కోర్సు చేసిన వారికి వెంటనే ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

**ప్రశ్న:** ఈ కోర్సు పూర్తి చేసిన వారు స్వయం ఉపాధికి పరిశ్రమలు స్థాపించుకోవచ్చా?

**జవాబు:** ఎంతో డిమాండ్ ఉన్న ప్యాకేజింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం బ్యాంకులో ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. ఈ డిప్లామా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు చాలామంది సొంతంగా పరిశ్రమలు స్థాపించి మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు.



కోర్సు విభాగాధిపతి డాక్టర్ వెంకట్‌రెడ్డి

**ప్రశ్న:** ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి.

**జవాబు:** కళాశాలలో చివరి సంవత్సరం ఈ కోర్సు చదువుతుండగానే వారికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా బహుళ జాతి సంస్థలైన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, అరబిందో ఫార్మా, నాగార్జున సిక్‌నోట్, ఐటీసీ, గ్లాండ్ ఫార్మా, ఇండియన్ ఇమ్యూనోలాజికల్, హ్యూమన్ బయోలాజికల్స్ తదితర సంస్థల్లో మంచి వార్షిక వేతనంతో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

## సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి**

**మల్లాపూర్:** రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్వీనగర్, భవానీనగర్, న్యూ భవానీనగర్, గ్రీన్‌హిల్స్ కాలనీ, నాగలక్ష్మీ నగర్, కేఎల్‌రెడ్డినగర్, కాలనీలో మూడవ రోజు ఎమ్మెల్యే పాదయాత్ర కొనసాగింది. ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్లు, సీసీ రోడ్లు వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కేఎల్‌రెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. మల్లాపూర్ డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో అన్ని వార్డుల్లో నూతనంగా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసున్నామని తెలిపారు. 20 రోజుల్లో కాప్రా సర్కిల్ మొత్తంలో 1,036 ఫిర్యాదులు వస్తే వాటిలో 900లకు పైగా సమస్యలను సత్వరమే పరిష్కరించామని పేర్కొన్నారు. అవసరమైన చోట్ల రోడ్లు, డ్రైనేజీలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

## కాంగ్రెస్ గెలుపునకు సమష్టిగా కృషిచేద్దాం

**డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్**

**అల్వాల్:** కాంగ్రెస్ గెలుపునకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం అల్వాల్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మచ్చబొల్లారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ నియామకం జరిగింది. ప్రధాన కార్యదర్శులుగా బొబ్బిలి రేవంత్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, కార్యదర్శిగా నందికంటి నరేష్, ఉపాధ్యక్షులుగా మల్లేష్, మధుసూదన్, సంయుక్త కార్యదర్శులుగా సంజయ్, శ్రీనాథ్, కార్యనిర్వాహణ కార్యదర్శిగా నాందాస్ నియమితులయ్యారు. నూతన కమిటీ ప్రతినిధులకు నియామక పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మచ్చబొల్లారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పవన్‌కుమార్, సీనియర్ నాయకులు డోలి రమేష్, సంతోష్‌రెడ్డి, కృష్ణగౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

## విద్యార్థుల నాయకత్వ స్వీకరణ మహోత్సవం



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

**అల్వాల్:** వెంకటాపురం డివిజన్ పరిధిలోని కానాజీగూడలో ఉన్న శ్రీనారాయణ విద్యా భవన్‌లో శుక్రవారం విద్యార్థులకు నాయకత్వ స్వీకరణ మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఏసీపీ జి.శంకర్‌రాజు, ఎస్ఐ జ్యోతి, ఏఎస్ఐ వికారుద్దీన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, ఇతర సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలతోపాటు వాటిని పాటించాల్సిన అవశ్యకత, మైనర్ రైడింగ్‌పై ప్రత్యేకంగా వివరించారు. అనంతరం విద్యార్థులు జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల అధ్యక్షులు జి.రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎం.పద్మనాభం, పాఠశాల ప్రిన్సిపల్ కేవీ రాఘవాచార్యులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### మురుగుతో తిప్పలు పట్టదా..?

**ఉప్పల్:** ఉప్పల్ హరిజనబస్తీ గాంధీనగర్‌లో నెల రోజులు డ్రైనేజీ పొంగిపొరుతూ రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారినా జలమండలి అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం జేరుసలేం మత్తయ్య ఆధ్వర్యంలో జలమండలి అధికారులు, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీతో రోడ్లు నిండి ఇళ్లలోకి మురుగు చేరుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు.

**నిధులున్నా.. నిర్లక్ష్యం ఎందుకు..?**

ఉప్పల్ గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్యను తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, సౌత్ స్వరూప్‌నగర్, ఇందిరానగర్, గాంధీనగర్ కాలనీ, కార్యకర్తలతో కలిసి జలమండలి జీఎం సంతోష్‌ను కలిసి పరిస్థితులను వివరించారు. ట్రంక్‌లైన్ ఏర్పాటు కోసం రూ.40 లక్షలు నిధులను మంజూరు చేయించామని, నిధులు విడుదల చేసినా పనులు ఎందుకు చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు.



### ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

**మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్‌లో శుక్రవారం శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, అనంతరెడ్డి, 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



కల్యాణ మహోత్సవంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

### పాత నేరస్తుడు అరెస్టు

**మల్కాజిగిరి:** పాత నేరస్తుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడ్‌మెట్ వాయిపురి కాలనీకి చెందిన అల్లెపు లక్ష్మణ్‌కుమార్ అలియాస్ లక్ష్మణ్(25) ఎలక్ట్రీషియన్. చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించడానికి దొంగతనాన్ని ఎంచుకున్నాడు. గతంలో మూడు కమిషరేట్ల పరిధిలో చైన్ స్నాచింగ్, దోపిడీ, వాహనాల దొంగతనాలకు పాల్పడ్డాడు. విశ్వశనీయ సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్ఓటీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు మల్కాజిగిరిలో లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏడు, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఒక హోండా యాక్టివా దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. అతడి వద్ద నుంచి వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

### బాలుడిపై పిచ్చి కుక్క దాడి

**మల్లాపూర్:** ఓ బాలుడిపై పిచ్చి కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన నాచారం ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నాచారం ఓల్డ్ విలేజ్‌కు చెందిన చంద్రశేఖర్ కుమారుడు రోహిన్ శుక్రవారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లి తిరిగివస్తుండగా పిచ్చి కుక్క దాడి చేయడంతో అతడి తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చిన్నారిని ఆస్పత్రికి తీసుకువెళ్లి టీకాలు వేయించారు.

### ఆలయ స్థలం పరిరక్షణకు కృషి

**అల్వాల్:** అల్వాల్ డివిజన్ పాత అల్వాల్ భీమ్‌రావునగర్‌లో వెలిసిన అమ్మవారి ఆలయ స్థలం పరిరక్షణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం ఆయన భీమ్‌రావునగర్ కాలనీలో ఉన్న అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా వివాదస్పదంగా మారిన ఆలయానికి సంబంధించిన స్థలంపై సర్కిల్ అధికారులు చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ స్థలాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్ జితేంద్రనాథ్, సర్కిల్ ఏసీపీ విజయశ్రీ, కాలనీ వాసులు గోపి, బాలరాజు, బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రెడ్డి, మధు, ఉదయ్, ప్రవీణ్ ఉన్నారు.

### ఈసీఐఎల్ చౌరస్తాలో కాంగ్రెస్ నిరసన

**కుషాయిగూడ:** ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ అనర్హతపై స్టే కోసం వేసిన పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు విచారణకు స్వీకరించకుండా తిరస్కరించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఉప్పల్ బి బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పత్తికుమార్, గద్దం యాదగిరి, గోపాల్‌యాదవ్, శ్రీను, ముసలి శ్రీనివాస్, శ్రీకాంత్, కమలాకర్, సుధాకర్, సంపత్ పాల్గొన్నారు.

### ఆర్థికసాయం

**కుషాయిగూడ:** అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందిన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మౌనిక కుటుంబ సభ్యులకు బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి శుక్రవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ట్రస్టు ఛైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందజేసినట్లు జంపాల్‌రెడ్డి తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

**ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు**

**అల్వాల్:** మల్కాజిగిరి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని మురళీకృష్ణ కాలనీ, భవానీనగర్, వీబీఆర్ జ్యోతినగర్, వుడ్‌నతోట తదితర ప్రాంతాల్లో ఆయన రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంవదర్బంగా కాలనీలలో నెలకొన్న వదరనీటి కాల్వలు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, స్తంభాలు, తాగునీటి పైపులైన్ నిర్మాణం, ఇటీవల అభివృద్ధి చెందుతున్న కాలనీల్లో రోడ్లు తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు కాలనీల ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్పొరేటర్ జితేంద్రనాథ్, అధికారులు మహేష్, సుచేందర్, సాంబయ్య, ప్రభాకర్, ప్రవీణ, రమేష్, రవళి, చారి, అనిత్, నరేష్, నవీన్, కాలనీవాసులు భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, సుధాకర్‌రావు, సుధీర్‌రెడ్డి, శ్రీహరిగౌడ్, మహేందర్‌రెడ్డి, రామారావు, రాజుయాదవ్, విజయ్, బీరయ్య, యాదగిరి, మధు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

### నాణ్యమైన సేవలు అందించాలి

**గౌతంనగర్:** వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. సాయినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫస్ట్ క్రైయ్ చిన్న పిల్లల వస్త్ర దుకాణాన్ని ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీతయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు అవసరమైన అన్ని రకాల ఉత్పత్తులు ఒకేచోట లభించడం వల్ల తల్లిదండ్రులకు ఎంతో శ్రమ తగ్గుతుందన్నారు. నిర్వాహకులు సూర్య, శ్రావణి, బీఆర్ఎస్ నేత మేకల రామయాదవ్ పాల్గొన్నారు.



ఫస్ట్ క్రైయ్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

### ఉద్యమకారుడికి పరామర్శ

**మల్కాజిగిరి:** మల్కాజిగిరికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు శ్రీరామ్ ఉపేందర్ మాతృమూర్తి శ్రీరామ్ ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులు జీఎస్వీ సతీష్‌కుమార్, రాముయాదవ్, గుండా నిరంజన్ పరామర్శించారు.

## అసత్య ఆరోపణలు తగదు

**కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్**

**బోడుప్పల్:** ప్రజా సమస్యలపై పోరాడుతుంటే వాటిని ఎదుర్కోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. చెంగిచర్లలో శుక్రవారం మాజీ సర్పంచ్ తోటకూర లక్ష్మి, పన్నాల జనార్దన్ రెడ్డి, బుచ్చిరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబరు 85లో 3.21 ఎకరాల స్థలంపై మూడు రోజులుగా మంత్రి మల్లారెడ్డి పోలీసులతో కలిసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కొన్న భూమిని కబ్జా చేసినట్లు ఆరోపణలు చేస్తున్నారని, కబ్జా అని నిరూపిస్తే నా భూమిని వదిలిపెడతానని, నిరూపించలేకపోతే ఏమి చేస్తారో ప్రజలకు చెప్పాలని ఆయన సవాల్ విసరారు. పోలీసు అధికారులు కూడా పరిధి దాటి వ్యవహరిస్తూ, మూడు రోజులుగా పోలీసులు తమ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్




### మూడు నెలల జీతాలు ఇవ్వండి

**నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో సమ్మె**

**మల్లాపూర్:** నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ నర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ, నాలుగో తరగతి సిబ్బంది శుక్రవారం మూడు నెలల జీతాలను ఇవ్వాలని కోరుతూ సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎండీ యూసఫ్, నరసింహ మాట్లాడారు. సిబ్బంది మూడు నెలలుగా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈఎస్ఐలో పూర్తిస్థాయి డైరెక్టర్ లేకపోవడంతో ప్రతినెలా కార్మికులకు జీతాలు రావడం లేదన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ కాంట్రాక్టర్లను యూనియన్ నాయకులను పిలిపించి తక్షణమే 3 నెలల జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వేణు, ధన్‌రామ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నాగమణి, సుమలత, కార్మికులు నరసింహ, వేణుమాధవ్, నిరంకారి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

